క్లుప్తంగా

ఆర్బీకేల్లో జోరుగా విత్తన నమోదు



రోలుగుంట ఆర్బీకేలో పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

రోలుగుంట: ఖరీఫ్ సాగు కోసం ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందించేందుకు చేపట్టిన నమోదు ప్రక్రియ మండలంలో జోరుగా సాగుతోంది. ఈ సందర్భంగా రోలుగుంటలో ఎంపీఈవో వాణి రైతులకు కావాల్సిన వరి రకాన్ని బట్టి నగదు తీసుకుని ఆధార్ కార్డు వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏవో ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు ఏటా మాదిరిగానే ఆర్‌జేఎల్ రకానికి డబ్బులు చెల్లిస్తున్నారన్నారు. రైతులు కోరిన అన్ని రకాల విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవం



కల్యాణోత్సవంలో భక్తులు

గొలుగొండ: ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జానకీరాంపురంలో సీతారామల కల్యాణ మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఆలయాన్ని నిర్మించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంతోపాటు నర్సంగబిల్లి, పప్పుశెట్టిపాలెం, జోగుంపేట, గొలుగొండ గ్రామాల భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకండా కమిటీ సభ్యులు అన్ని సౌకర్యాలు కల్పించారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి

నాతవరం: గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి తెలిపారు. చమ్మచింతలో రూ.10 లక్షలతో నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతోపాటు గ్రామస్తుల సహకారంతో ఆలయం నిర్మించామన్నారు. దీన్ని సర్వాంగ సుందరంగా తయారు చేసి ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో ప్రారంభిస్తామన్నారు. సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

క్షతగ్రాతుడికి ఆర్థిక సాయం



గాయపడిన దేముడుబాబుకు నగదు అందిస్తున్న సంస్థ సభ్యులు

దేవరాపల్లి: చెట్టు మీద నుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన నిరుపేద యువకుడు బర్ల దేముడుబాబుకు ×స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్‌* సంస్థ ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటుకుంది. కె.కోటపాడు మండలం సంతపాలెంకు చెందిన అతడు వైద్యానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్నేహాంజలి ఫర్ పూర్ సంస్థ సభ్యులు మారేపల్లిలోని మేనత్త ఇంట్లో ఆశ్రయం పొందుతున్న బాధితుడిని శనివారం పరామర్శించారు. ఆర్గనైజేషన్ తరఫున రూ.10 వేలు అందజేసి బాసటగా నిలిచారు. సంస్థ సభ్యులకు ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ సంస్థ ప్రతినిధి మచ్చ వీర్రాజు, సభ్యులు జి. సంతోషి నళిని, త్రినాథ్, గోవింద, గోకాడ ఉపేంద్ర పాల్గొన్నారు.

అమిత్ షా సభను విజయవంతం చేయండి

మాడుగుల: విశాఖ రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆదివారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పుట్టా గంగయ్య కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు.

ఉపాధికి ఊపు.. సాగువనరుల రూపు

- గ్రామాల్లో కాలువలు, చెరువుల అభివృద్ధి పనులు
- కూలీలకు సైతం రోజు కూలి రూ.272
- వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు



బత్తుల వెంకయ్య చెరువులో ఉపాధి పనులు



కొత్తకోట నాయుడు చెరువులో ఆక్రమణ తొలగింపునకు సర్వే చేస్తున్న సిబ్బంది

రావికమతం: ఉపాధి హామీ పనులతో సాగునీటి వనరుల రూపురేఖలు మారిపోతున్నాయి. గతంలో పిచ్చిమొక్కలతో నిండిన చెరువుల్లో పూడికతీత పనులు పూర్తి చేసుకుంటున్నాయి. ఏ మాత్రం చినుకు పడినా పుష్కలంగా నీరు నిల్వ ఉండనుంది. సాగునీటికి ఆటంకం లేకుండా కాలువల సైతం కొత్త రూపు సంతరించుకున్నాయి. ప్రస్తుత వేసవి కాలానికి మండలంలోని 28 పంచాయతీల్లో ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఈ పనులు చేస్తున్నారు. ప్రధానంగా కాలువలను, చెరువులను ఉపాధి నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. మరోవైపు వేతనదారులకు రోజు కూలి రూ.272 వేతనం గిట్టుబాటు అవుతోంది. మండే ఎండలకు గురికాకుండా పని ప్రాంతాల్లో వీఆర్పీ, మేట్లకు, వేతనదారులకు అధికారులు ప్రత్యేక సూచనలు చేస్తున్నారు. ఉదయం 5–6 గంటల సమయానికే ఉపాధి పనులకు హాజరవుతున్న కూలీలు పది గంటలలోపు ఇంటికి చేరుకుంటున్నారు.

80 శాతం మేర ఉపాధి పనులు...

ఈ ఏడాది ఐదు లక్షలకుపైగా పని దినాల లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ. 21 కోట్ల పనులు చేయాలని అధికారుల లక్ష్యం కాగా, ఇప్పటికే 80 శాతం



పూడిక పోయిన చెక్‌డ్యాం కాలువ పనులు చేపడుతున్న దృశ్యం

పనులు చేపట్టారు. అన్ని పంచాయతీల పరిధి చెరువుల్లోనే కాకుండా సాగునీటి కాలువలు, జీడి తోటల్లో కందకాల తవ్వకాలు, ఫారంపండ్ పనులు చేస్తున్నారు. పనులు పూర్తయిన కాలువల రూపురేఖలు మారిపోతున్నాయి. అడపాదడపా వర్షాలు పడటంతో భూమి మెత్తబడి ఉపాధి పనులు వేగవంతమయ్యాయి. దాంతో రావికమతం, కొత్తకోట, తదితర గ్రామాల్లో విసారపు సోమునాయుడు, గుర్రాల నారాయణరావు, ముద్దాల చినమ్మలు, కాకర లక్ష్మి, వేపాడ చంటిబాబు, కొశిరెడ్డి చినమ్మలమ్మ తదితర గ్రూపుల సభ్యులకు అత్యధికంగా రోజుకు రూ.270 వరకు కూలి లభిస్తుంది. మరోపక్క మేడివాడ, కొత్తకోట గ్రామాల్లో పెద్ద చెరువు, నాయుడు చెరువులో ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు సర్వే చేపట్టారు. ఒక్కో చెరువులో ఆక్రమణలో ఉన్న మూడెకరాలకుపైగా భూములకు బౌండరీ ఫిక్స్ చేసి త్వరలో అక్కడా ఉపాధి పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు.

వడదెబ్బకు గురికాకుండా పనులు



మండలంలో 11,400 మంది జాబ్ కార్డుదారులకు పని కల్పిస్తున్నాం. ఏడాదికి రూ.27 వేలపైగా గిట్టుబాటు కల్పించాలని లక్ష్యంతో పనులు చేపడుతున్నాం. ఏ ఒక్కరూ వడదెబ్బకు గురికాకుండా ఉదయాన్నే పనులు ప్రారంభిస్తున్నాం. ఎండ ముదరక ముందే ఇంటికి పంపిస్తున్నాం. దీంతో కూలీల ఆరోగ్యానికి ఢోకా లేదు.

– దాడి వెంకట కాశీఅప్పారావు, ఏపీవో, రావికమతం

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా జగన్ పాలన

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



రొంగలపాలెంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు మంజూరు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. శనివారం రొంగలిపాలెం పంచాయతీ శివారు కాముడిపాలెం, తమనారపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ విప్ ఇంటింటా తిరిగి ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన సంక్షేమాలను కరపత్రాల ద్వారా తెలియజేశారు. అందులో పేర్కొన్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రజావసరాలు తెలుసుకుని మేనిఫెస్టోలో చేర్చి అమలుపరుస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దుక్కుతుందన్నారు. కాముడుపాలెంలో విద్యుత్ సమస్య, తమనారపాలెంలో డ్రైనేజీ సమస్యను స్థానికులు ధర్మశ్రీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని ఆయా శాఖల అధికారులతో వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ లీడర్ పోతల లక్ష్మీశ్రీనివాస్, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ టి.వి.రమణ, వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, సర్పంచ్ రొంగలి, ఏఈలు ఉమ మహేశ్వరుడు, రాజు, ఏవో విజయలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు కృష్ణంనాయుడు, వెంకట సత్తిబాబు, శేఖర్, మాజీ సర్పంచ్ బంటు సూర్య సన్యాసిదేముళ్లు, కుంచంగి హరిబాబు, ఉలబల రాము తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలోనూ 'గడపగడపకు'

ప్రజల సమస్యలు తెలుసుకున్న నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్



పథకాలపై ముద్రించిన పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: మండుటెండలోనూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. మండలంలోని శెట్టిపాలెం, వెంకన్నపాలెం గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. వీటిపై ముద్రించిన పత్రాలను పంపిణీ చేశారు. సమస్యలపై వెంటనే అధికారులతో మాట్లాడటంతోపాటు వాటిని నమోదు చేసుకున్నారు. సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శెట్టిపాలెంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గొర్లి శివాజీ, సతీష్‌లను పరామర్శించారు. పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ ఆయా సన్యాసమ్మను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, ఏపీ ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్లి వరలక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వర్రి పాత్రుడు, సచివాలయాల మండల కన్వీనర్ చిటికెల రమణ, నాయకులు బొడ్డు గోవిందరావు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు



సీతారాముల వారిని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం

దేవరాపల్లి: ఎం. అలమండలో గణపతి సహిత సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ, షిర్డీ సాయినాథ విగ్రహ, ధ్వజ స్తంభ సహిత శిఖర ప్రతిష్ట మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఆవరణలో జరిగిన హోమాల్లో పాల్గొని జై శ్రీరామ్ జై శ్రీరామ్ నామ స్మరణంతో తరించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొని సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పోతల లక్ష్మీశంకర్, సర్పంచ్ దాడి జగన్ ఆయనకు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, ఉగ్గ్రాకుల గంగాభవానీ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ పోతల వెంకటరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బండారు ప్రసాదరావు పాల్గొన్నారు.

సొంత నిధులతో బోరు ఏర్పాటు



రిగ్గు పనుల కోసం టెంకాయ కొడుతున్న దాత రమణ

రోలుగుంట: బుచ్చింపేట మేదరి వీధిలో వేసవి దాహార్తి సమస్య తీర్చేందుకు గ్రామానికి చెందిన దాత అనిమిరెడ్డి రమణ తన సొంత నిధులతో బోరు ఏర్పాటు కోసం ముందుకొచ్చాడు. శనివారం ఆయన కొబ్బరికాయ కొట్టి రిగ్గు పనులు ప్రారంభించాడు. కొన్నాళ్లుగా చేతివృత్తి పనులు చేసుకుంటున్న ఇక్కడ మేదరి కుటుంబాల తాగునీటి కష్టాల గురించి తెలుసుకుని చలించిపోయాడు. వెంటనే ఇక్కడ బోరు ఏర్పాటు చేయడంతో అతనికి కృతజ్ఞతలు తెలిపారు.

చివరి దశలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

- మాడుగుల ఎంపీపీ రామధర్మజ పరిశీలన



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ రామధర్మజ, తదితరులు

మాడుగుల: స్థానిక జవ్వాది గెడ్డ నుంచి శివాలయం వరకు రోడ్డు లేకపోవడంతో 5, 6 వార్డు ప్రజలు మెయిన్‌రోడ్డుకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ సమస్యను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి వారు తీసుకెళ్లారు. దాంతో 25 అడుగుల వెడల్పుతో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం చివరి దశకు చేరుకున్న ఈ పనులను ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి శనివారం పరిశీలించారు. నాణ్యతగా చేస్తుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు వేమన గణేష్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, నాయకుడు ఎడ్ల హేమంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేలాది ఆలయాలు నిర్మిస్తున్న ఖ్యాతి జగనన్నదే..

- ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



వినాయకుడి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్

నాతవరం: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధితోపాటు వేలాది దేవాలయాలను నిర్మిస్తున్న ఖ్యాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. నాతవరంలో రూ.10 లక్షలతో నిర్మించిన వినాయకుడి ఆలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. వేదపండితులతో హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తిభావం ఎక్కడైతే అధికంగా ఉంటుందో ఆ గ్రామం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజల భాగస్వామంతో ప్రభుత్వం ఆలయం ఒక్కంటికి రూ.10 లక్షల చొప్పున మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గంలో రూ.10 కోట్లతో యుద్ధ ప్రాతిపదికన ఆలయాలు నిర్మిస్తున్నామన్నారు. నాతవరం మండలంలో ఇంతవరకు రెండు ఆలయాలు ప్రారంభించామని, మరో 20పైగా ప్రారంభానికి సిద్ధం కాగా, 40 దేవాలయాల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వైస్ ఎంపీపీ పైల సునీల్, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, నాతవరం వర్తక సంఘం కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శెట్టి లచ్చబాబు, గ్రామ పెద్ద అంకంరెడ్డి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు



ఇన్‌చార్జి ఎంపీడీవో పార్థసారథి

నాతవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వరి విత్తనాలు సకాలంలో అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఇన్‌చార్జి ఎంపీడీవో పోలుపర్తి పార్థసారథి తెలిపారు. ఆయన శనివారం వ్యవసాయ శాఖ సిబ్బందితో చర్చించి విలేకరులతో మాట్లాడారు. తాండవ రిజర్వాయరు మూలంగా జిల్లాలోనే అధిక విస్తీర్ణంలో వరి సాగు మండలంలో పండిస్తున్నారన్నారు. రైతులు సాగు ఆధారంగా వివిధ రకాల వరి విత్తనాలు 1,902 క్వింటాళ్ల అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మండలంలో 16 ఆర్బీకేల్లో వీటిని పంపిణీ చేస్తామన్నారు. విత్తనాలు కావలసిన రైతులు ముందుగా ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలన్నారు. రైతులకు ఖరీఫ్ సాగుకు ఎలాంటి సహాయం కావాలన్న అక్కడ వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడంతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సచివాలయాల్లో నూతన భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లకు సూచించామన్నారు.

గ్రంథాలయానికి సోలార్ సిస్టం ఏర్పాటు చేస్తా

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సన్యాసిపాత్రుడు



సమ్మర్ క్యాంపు ముగింపు సభలో మాట్లాడుతున్న చింతకాయల సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయానికి సోలార్ సిస్టం ఏర్పాటు చేస్తానని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు హామీ ఇచ్చారు. శనివారం ఇక్కడ వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అవసరమైన జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయన్నారు. పాఠశాల విద్యతోపాటు విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయాలను ఉపయోగించుకోవటం ద్వారా పోటీ పరీక్షల్లో రాణించవచ్చనని ఎంఈవో సాయిశైలజ అన్నారు. అనంతరం సమ్మర్ క్యాంపుకు విచ్చేసిన చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు. ఆర్థోపెడిక్ డాక్టర్ రాజు, డాక్టర్ అలేఖ్య, విశ్రాంత ఎంఈవో కె.అప్పారావు, విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కుమార్‌బాబు, రిసోర్స్ పర్సన్ కనకరాజు, జయలక్ష్మి, రాఘవకుమారి, పి.శ్రీనివాస్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు కన్నబాబు పాల్గొన్నారు.

కె.కోటపాడు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న కథలు, విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను చదువుకోవాలని విద్యార్థులకు గ్రంథపాలకురాలు సౌమ్య సూచించారు.


దోమల నివారణతో మలేరియా దూరం



ఎ.భీమవరంలో అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న రాము, రాజు

కె.కోటపాడు: వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్త పడితే, మలేరియా రాకుండా ఉండవచ్చని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ బి.రాము, హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్.రాజు తెలిపారు. మలేరియా మాసోత్సవంలో భాగంగా ఎ.భీమవరంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీటిని ఏడు రోజుల కన్నా ఎక్కువ ఉండకుండా తొలగించుకోవాలని సూచించారు. ప్రతీ వారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. మురుగులో దోమలు లార్వాను విడిల్చడం వల్ల దోమల వృద్ధి చెందుతాయన్నారు. సర్పంచ్ తర్రా సన్యాసమ్మ, తర్రా శేషు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే జీవితం చిత్తు



మరుపాకలో యువకులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు

రావికమతం: మత్తు, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు సూచించారు. శనివారం మరుపాకలో విలేజ్ లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ యువకులకు పలు సూచనలు చేశారు. పట్టుదలతో శ్రమిస్తే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎన్నో ఉన్నాయన్నారు. చెడు తిరుగుళ్లు తిరిగి మత్తుకు బానిసైతే ఆరోగ్యం పాడవుతుందని, జీవితం నాశనమవుతుందన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. వీటిని ఎవ్వరైనా కలిగి ఉన్నా, విక్రయించినా సమాచారం ఇవ్వాలన్నారు.

చెరువుల అభివృద్ధితో భూగర్భ జలాల పెంపు



పి.భీమవరంలో చెరువు పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి పార్థసారథి

బుచ్చెయ్యపేట: చెరువులను అభివృద్ధి చేయడం వల్ల భూగర్భ జలాలు పెరగడంతోపాటు రైతులకు పుష్కలంగా సాగు నీరు అందుతుందని జిల్లా ప్రత్యేకాధికారి పార్థసారథి తెలిపారు. అమృత సరోవర్‌లో భాగంగా పి.భీమవరంలోని సోమరాజు చెరువు, పెదమదీనలో తివ్వ కొండ చెరువు పనులను ఆయన అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. చెరువుల అభివృద్ధి కోసం నిధుల వినియోగం, పనుల రికార్డులను తనిఖీ చేశారు. రైతులకు ఉపయోగపడేలా, కూలీలకు పూర్తిగా పనులు కల్పించేలా చెరువులను అభివృద్ధి చేయాలన్నారు. సర్పంచ్‌లు పినపోలు రామునాయుడు, కేవీఆర్ నాయుడు, పీడీ శ్రీనివాస్, ఏపీవో మురళీకృష్ణ, ఈసీ నితీష్‌కుమార్, కొండాజీ పాల్గొన్నారు.

ఎండ తగ్గేదేలే..

ఆరుబయట తిరగడానికి జనం బెంబేలు



ఎండలో ముఖానికి గుడ్డలు కప్పుకుని వెళ్తున్న పాదచారులు

బుచ్చెయ్యపేట/మాడుగుల రూరల్: ఎండ తగ్గేదేలే అన్న రీతిలో కాస్తోంది. జూన్ నెల వచ్చి అగ్ని,రోహిణి కార్తెలు పోయినా ఎండ తీవ్రత మాత్రం తగ్గడం లేదు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉక్కపోతతో ఇళ్లలో ఉండలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే నిప్పురవ్వలు రాజేస్తున్న ఎండతో బయట ప్రయాణాలంటే బెంబేలెత్తుతున్నారు. కొంతమంది గొడుగు వేసుకుని, టోపీలు ధరించి రాకపోకలు చేస్తున్నారు. సాయంత్రం 5 గంటల వరకు ఒకే రీతిలో ఎండ తీవ్రత ఉండటం వల్ల రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉపాధి కూలీలు, వ్యవసాయదార్లు ఉదయం 9 గంటలకే పనులు ముగించుకుని నీడకు చేరుతున్నారు.